క్లుప్తంగా

నేడు వేలం పాట

బి.కొత్తకోట: పట్టణంలో సంతలకు వేలం పాటలు నిర్వహిస్తున్నామని కమిషనర్ పల్లవి ఆదివారం తెలిపారు. వారపుసంత, దినసరి మార్కెట్, ప్రైవేటు బస్టాండ్‌కు గుత్త అప్పగించడం కోసం వేలం పాటలు నిర్వహించి ఎక్కువకు పాడిన పాటదారుని ఏడాది పాటు గుత్తను అప్పగించడం జరుగుతుందని తెలిపారు. వారపుసంతకు రూ.4 లక్షల డిపాజిట్, రూ.5 లక్షల సాల్వేన్సీ, దినసరి మార్కెట్‌కు రూ.2 లక్షల డిపాజిట్, రూ.2.50 లక్షలకు సాల్వేన్సీ, ప్రైవేటు బస్టాండ్‌కు రూ.3 లక్షల డిపాజిట్, రూ. 3.50 లక్షల సాల్వేన్సీ చెల్లించిన వారు సోమవారం సాయంత్రం జరిగే వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిని సన్మానిస్తున్న రాజశేఖరరెడ్డి

తంబళ్లపల్లె: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షుడుగా ఎర్రసానిపల్లె పంచాయతీ ఎర్రమద్దువారిపల్లెకు చెందిన రాజశేఖరరెడ్డిని పార్టీ అధిష్టానం ఎన్నుకుంది.

నూతన కమిటీ ఎన్నిక

మదనపల్లె : పట్టణంలోని అన్నమయ్యసర్కిల్, చౌడేశ్వరి కల్యాణమండపం సమీపంలో మదనపల్లె టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఆదివారం తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు ప్రారంభించారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. మదనపల్లె టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మోపూరి రెడ్డిప్రసాద్, ఉపాధ్యక్షులుగా కొక్కంటి శివశంకర్, కార్యదర్శిగా బావాజాన్ షేక్, జాయింట్ సెక్రటరీగా పులగంటి భరత్, కోశాధికారిగా బి.శ్రీనివాసులు, ఈసీ మెంబర్లుగా సి.రమేష్‌బాబు, జబ్బల అమరనాథ్ నియమితులయ్యారు.

మాజీ ఎమ్మెల్యే సంతాపం



ఈశ్వరయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

గుర్రంకొండ: మండలంలోని శెట్టివారిపల్లె పంచాయతీ బోడిగుట్ట హరిజనవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కన్నెమడకల ఈశ్వరయ్య మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సంతాపం ప్రకటించారు. ఈశ్వరయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆదివారం బోడిగుట్ట హరిజనవాడకు చేరుకొని మృతుడి భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ఆర్థికసాయం అందించారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎల్వీరమణ, మాజీ సర్పంచ్ సూరి, మాజీ ఎంపీటీసీ పెద్దరెడ్డెప్ప, నాయకులు రవి, వెంకటరమణలు పాల్గొన్నారు.

'మిట్స్'ను సందర్శించిన అమెరికన్ డైరెక్టర్



బారీగా డేను సన్మానిస్తున్న అధ్యాపకులు

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలను అమెరికాలోని రివియర్ యూనివర్సిటీ స్ట్రాటజిక్ గ్లోబల్ ఎంగేజ్మెంట్ డైరెక్టర్ బారీగా డే సందర్శించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ ఆదివారం తెలిపారు. రివియర్ యూనివర్సిటీ, కళాశాల మధ్య విద్యా సహకారాన్ని పెంపొందించడం, విద్యార్థులకు ఉన్నత విద్యలో సహకారం, పరిశోధన, భవిష్యత్ కార్యక్రమాలపై అవగాహన ఒప్పందం లక్ష్యంగా చర్చలు జరిగాయని పేర్కొన్నారు. అనంతరం బారీగా డేను సన్మానించారు.

బ్యానర్ల ఏర్పాటుకు అనుమతి తప్పనసరి

బి.కొత్తకోట: పట్టణ పరిధిలో ఎవరైనా బ్యానర్ల ఏర్పాటు చేయాలనుకుంటే నగర పంచాయతీ నుంచి అనుమతి పొందాలని కమిషనర్ పల్లవి కోరారు. రాజకీయ, వాణిజ్య, తదితర వాటికి ఒకే విధమైన నిబంధనలు ఉంటాయని తెలిపారు. అనుమతి తీసుకున్న తర్వాత బ్యానర్లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

కురబలకోట: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ముదివేడు ఎస్‌ఐ దిలీప్ కుమార్ తెలిపారు. ఆదివారం ఎస్‌ఐ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధిస్తామని తెలిపారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్లను ఉపయోగించొద్దని సూచించారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు.

వరాల దేవుడు.. లక్ష్మీనరసింహుడు

- రేపటి నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు
- 10 రోజుల పాటు ఉత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న టీటీడీ అధికారులు

గుర్రంకొండ: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారమై విరాజిల్లుతున్నాడు మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనారసింహుడు. స్వామివారి బ్రహోత్సవాలు బుధవారం నుంచి 15వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందు కోసం వారం రోజులుగా టీటీడీ అధికారులు అని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదే ఆలయంలోనే వేంకటేశ్వర స్వామి భక్తురాలు తరిగొండ వెంగమాంబ ఆలయం కూడా ఉండడం గమనార్హం.

ఆలయ చరిత్ర

పూర్వకాలంలో దుర్వాస మహామునిచే ఆలయంలో స్వామివారు ప్రతిష్టంచబడినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. చోళరాజుల కాలంలో బాకరాపేట సమీపంలోని చిట్టేచెర్ల గ్రామంలో రామానాయుడు అనే పాలేరు కుటుంబానికి పశుసంపద ఎక్కువగా ఉండేది. వారు పశువులను మేపుకొంటూ తరికుండకు వచ్చేవారు. ప్రస్తుత ఆలయం ఉన్న ప్రాంతమంతా అటవీప్రాంతంగా ఉండేది. పశువులు ఇక్కడి వచ్చి సేద తీరేవి. ఓక రోజు రామానాయుడు దంపతులు మజ్జిగ చిలుకుతుండగా మజ్జిగ కుండలో స్వామి వారు నల్లటి రాయిలాగా ఉద్భవించాడు. రాయి అనుకొని మజ్జిగ కుండలో నుంచి తీసి పక్కన పడేశారు. మురుసటి రోజు మళ్లీ ఇదే సంఘటన పునరావృతమైంది. అదే రోజు రాత్రి స్వామివారు రామనాయుడు కలలో కనిపించి తాను లక్ష్మీనరసింహస్వామినని చెప్పి తరికుండకు పశ్చిమ భాగంలో మారెళ్లగెవి (గుహ) ఉందని, అందులో ధనం ఉందని ఆ ధనంతో ఇక్కడ ఆలయం నిర్మించాలని చెప్పారు. మరుసటి రోజు సదరు గెవి వద్దకు వెళ్లి పరిశీలించగా ధనం కనిపించింది. ఆధనంతో ఆలయాన్ని పునః ప్రతిష్టించారు. అప్పటి నుంచి తరికుండ తరిగొండగా మారింది. స్వామవారి ఆలయం ముందుభాగంలో దుర్వాస మహాముని చేత ప్రతిష్టంచబడిన ధర్మపీఠం ఉంది. ఇక్కడ అసత్య ప్రమాణాలు చేస్తే వారి వంశం నిర్వంశం అవుతుందని మహాముని శాపముంది.



బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయం

బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు ఇలా..

06న ధ్వజారోహణము, ఊంజల్‌సేవ, హంసవాహనం 07న ముత్యపుపందిరి వాహనం, స్నపన తిరుమంజనం. ఊంజల్‌సేవ, హనుమంత వాహనం, 08న కల్పవృక్ష వాహనం, ఊంజల్‌సేవ, సింహవాహనం, 09న తిరుచ్చి ఉత్సవం, ఊంజల్ సేవ, స్నపనతిరుమంజనం, పెద్దశేష వాహనం, 10న తిరుచ్చి ఉత్సవం, ఊంజల్‌సేవ, గజవాహనం , 11న తిరుచ్చి ఉత్సవం, సర్వభూపాల వాహనం, కల్యాణోత్సవం, గరుడసేవ, 12న రథారోహణం, రథగమనం, ధూళీ ఉత్సవం, 13న సూర్యప్రభ వాహనం, ఊంజల్‌సేవ, చంద్రప్రభవాహనం, అశ్వవాహనం, పార్వేట ఉత్సవం, 14న వసంతోత్సవం, స్నపన తిరుమంజనం, చక్రస్నానం, తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం, 15న స్నపన తిరుమంజనం, పుష్పయాగం నిర్వహిస్తారు.

ఏర్పాట్లు ముమ్మరం

స్వామివారి బ్రహోత్సవాలకు టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తొండమనాడు నుంచి స్వామివారి వాహనాలన్నింటినీ ఇప్పటికే ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయం ముందుభాగంలో మండపాలు చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. ఆలయంలో కొత్తగా వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. బ్రహోత్సవాల పర్యవేక్షణ కోసం వచ్చే అధికారులకు, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించే కళాకారుల కోసం అతిథి గృహాలు సిద్ధం చేశారు. గ్రామంలోని స్వామివారి ఆలయం నుంచి బస్టాండు వరకు స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీనరసింహస్వామి అమ్మవార్లు



ఆలయంలో వెలసిన శ్రీ తరిగొండ వెంగమాంబ

చంద్రబాబుది నియంతృత్వ పాలన

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నియంతృత్వ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాజకీయ ప్రత్యర్థులు ఎవరైనా వారిపై కక్షసాధించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. వీరి వేధింపులకు కళాకారులు, రాజకీయ విశ్లేషకులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నటుడు, దర్శకుడు, రచయిత పోసాని కృష్ణమురళి అరెస్టు చంద్రబాబు కక్ష రాజకీయాలకు పరాకాష్టగా నిలుస్తోందని విమర్శించారు. పోసాని కొన్ని నెలల క్రితం తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు బహిరంగంగా ప్రకటించినా ఆయన్ను వేధించడం రాజకీయ కక్ష కాదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు చేస్తున్న తప్పుడు విధానాలను ఎవరూ ప్రశ్నించకూడదా, లోపాలను ఎత్తిచూపకూడదా అని నిలదీశారు. ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ, కనీసం అరెస్టు అయిన వ్యక్తికి చట్టబద్ధంగా న్యాయ సహాయం అందకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని తెలిపారు. భయంతో తప్పుడు వాంగ్మూలాలను నమోదు చేసి చంద్రబాబు టార్గెట్ చేసిన వ్యక్తులను వేదిస్తున్నారన్నారని పేర్కొన్నారు.

అరెస్టులపై పోరాటం

చట్టవ్యతిరేక అరెస్టులపై వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఇలాంటి వేధింపు రాజకీయాలు సరైనవి కాదని హితవుపలికారు. సోషల్ మీడియాలోనూ వేధింపులు తప్పడం లేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులపై దుర్మార్గంగా పోస్టులు పెడుతున్నా పోలీసులు వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.



ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

అండగా ఉంటా..అధైర్యపడొద్దు

తంబళ్లపల్లె: అందరికి అందుబాటు ఉంటూ అండగా నిలుస్తానని ఎవరూ అధైర్యపడొద్దని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి భరోసా ఇచ్చారు. మర్రి మాకులపల్లె పంచాయతీ కుడుములవారిపల్లెకు చెందిన తూగు చంద్రశేఖర్‌రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మళ్లీ మంచి రోజులు వస్తాయని ఎలాంటి సమస్య ఉన్నా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, నాయకులు రవి శంకర్‌రెడ్డి, చినబాబు, నరేంద్రరెడ్డి, మల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హమాలీల కూలి రేట్ల పెంపుపై హర్షం

మదనపల్లె : సివిల్ సప్లయిస్ హమాలీల కూలిరేట్ల పెంపుకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం జీఓనంబర్14ను జారీచేయడంపై ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మదనపల్లె సివిల్ సప్లయిస్ పాయింట్ వద్ద హమాలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో సాంబశివ మాట్లాడుతూ పౌరసరఫరాల సంస్థలో రాష్ట్రవ్యాప్తంగా మండల లెవెల్ స్టాక్ పాయింట్లలో పనిచేస్తున్న సుమారు 6,000 మంది హమాలీలకు వివిధ అంశాలకు పెంచిన రేట్లు గత ఒప్పందం కంటే ప్రస్తుత ఒప్పందం ద్వారా 11 కోట్ల 80 లక్షల రూపాయలు అదనంగా హమాలీలకు అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఫిబ్రవరి 28న దీనికి సంబంధించి రాష్ట్రప్రభుత్వం జీఓ నెం.14ను విడుదల చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హమాలీలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలు, పోరాటాలతోనే జీఓ వెలువడిందన్నారు. హమాలీల కూలి



మాట్లాడుతున్న సాంబశివ

రేట్లు క్వింటాల్‌కు రూ. 25 నుంచి 28 రూపాయలకు, దసరా బోనస్ రూ.6వేల నుంచి రూ.6,500కు, గన్నీ (బేల్ కు) రూ. 50 నుంచి 55కు, పామాయిల్ బాక్స్‌కు రూ. 0.50 నుంచి 0.75 పైసలు, ప్రతి ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు మంచినీటికి నెలకు రూ.600 నుంచి 1000/–లకు, ప్రతి హమాలీకి మూడు జతల యూనిఫాంతో పాటు స్వీపర్ కు ప్రస్తుతం అమలవుతున్న వేతనంపై రూ. 1000 అదనంగా పెంచేందుకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. హమాలీలు అయూబ్, వీరాంజనేయులు, కుమార్, దిలీప్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు

మదనపల్లె : రంజాన్ మాసం ప్రారంభమైన నేపథ్యంలో నియోజకవర్గంలోని మూడు మండలాలు, మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తిస్థాయిలో మౌలికవసతులు కల్పించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బోర్లలో నీటిలభ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అవసరమైతే కొత్త బోర్లు వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రంజాన్ సందర్భంగా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మసీదుల వద్ద సాయంత్రం వేళల్లో ఇఫ్తార్ సమయంలో పారిశుద్ధ్య నిర్వహణ పటిష్టంగా చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, మున్సిపల్ డీఈ శ్రావణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బయ్య, వేణుగోపాల్, మున్సిపల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంచే నిలయాలు

మదనపల్లె సిటీ: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంచే నిలయాలని ఏపీ గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా గ్రంథాలయానికి వచ్చిన పాఠకులు, పిల్లలతో గ్రంథాలయం గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాల్లో అన్ని రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు.



గ్రంథాలయంలో విజిటర్స్ పుస్తకంలో సంతకం చేస్తున్న కోటేశ్వరరావు

రోడ్డుప్రమాదంలో మహిళకు గాయాలు

రామసముద్రం : రోడ్డుప్రమాదంలో రామసముద్రం మండలానికి చెందిన మహిళ గాయపడిన సంఘటన ఆదివారం సోమల మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు రామసముద్రం మండలం నర్సాపురానికి చెందిన ఎనిమిది మంది కారులో తిరుమలకు వెళుతున్నారు. సోమల పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎదురుగా వస్తున్న జేసీబీ రోడ్డుపైకి వచ్చేందుకు ప్రయత్నిస్తుండగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న



రోడ్డుప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

భాగ్యమ్మ అనే మహిళకు గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం సదుం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వైభవంగా భోళా మల్లేశ్వరస్వామి కల్యాణం

నందలూరు : మండలంలోని చింతకాయలపల్లె గ్రామంలో వెలసిన శ్రీ భోళా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా టంగుటూరు మాజీ సర్పంచ్ చింతకాయల గంగినాయుడు ఆధ్వర్యంలో శ్రీ కామాక్షి సమేత భోళా మల్లేశ్వరస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అత్యంత సుందరంగా ముస్తాబు చేశారు. భక్తుల శివనామ స్మరణల నడుమ కల్యాణ వేడుకను కనుల పండువగా జరిపించారు. ఈ కల్యాణోత్సవంలో ముఖ్య అతిథులుగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు (ఎంపీ) మేడా రఘునాథ రెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణాన్ని తిలకించారు. నందలూరు మండల కన్వీనర్ సిద్దవరం గోపిరెడ్డి, గుండు మల్లికార్జున రెడ్డి, వాలంటరీ వింగ్ నియోజకవర్గం అధ్యక్షులు భాస్కర్ యాదవ్, బూసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, మోదుగుల చంద్ర, హర్షవర్ధన్ రెడ్డి, రాణా ప్రతాప్ రెడ్డి, మధు రాజు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి

ఉత్కంఠగా బండలాగుడు పోటీలు

భోళా మల్లేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా టంగుటూరు మాజీ సర్పంచ్ చింతకాయల గంగినాయుడు ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డిలు పోటీలను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో జరిగిన పోటీలలో పోతిరెడ్డిపల్లికి చెందిన త్యాగంరెడ్డి లింగారెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలిచి రూ. 30 వేలు నగదు బహుమతిని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు.

బాల్య వివాహం నేరం

లక్కిరెడ్డిపల్లి : మండలంలో వెలసిన శ్రీ గంగమ్మ తల్లి జాతరలో దేవాలయ కార్యనిర్వాహక అధికారి అనుమతితో బాల్య వివాహాలు, బాలల లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణాపై రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ భానుజ మాట్లాడుతూ బాల్య వివాహం చేయడం నేరమని, అందుకు సహకరించిన తల్లిదండ్రులు, బంధువుల పైన ప్రభుత్వం చట్ట ప్రకారం శిక్షతోపాటు జరిమానా విధిస్తారన్నారు. అలాగే బాల్య వివాహం చేసుకున్న వారికి పుట్టబోయే సంతానం బలహీనంగా పుట్టడం, రక్తహీనత ఏర్పడటం జరుగుతుందని వివరించారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా



మాట్లాడుతున్న మాజీ మంత్రి టీజీ వెంకటేష్

మదనపల్లె సిటీ: ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం శ్రీ వాసవీ కన్యాకా పరమేశ్వరిదేవి మహా కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్యవైశ్య హాస్టల్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాను మదనపల్లె పట్టణంలో జన్మించానని గుర్తు చేశారు. ఇక్కడ ప్రజలతో తనకు ఎంతో అవినాభావ సంబంధాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం నియమించే నామినేటెడ్ పోస్టులలో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కోరారు. ఆర్యవైశ్యులు అందరూ కలిసిమెలిసి ఐక్యత చాటాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా, టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పేదోడి ఫ్రిజ్‌లు వచ్చేశాయ్!



విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి కుండలు

మదనపల్లె సిటీ: ఈ ఏడాది మార్చిలోనే ఎండలు మండుతున్నాయి. భానుడు తన ప్రతాపాన్ని చూడటంతో బిందెలో నీరు ఎంత తాగిన దాహం తీరని పరిస్థితి. దీంతో పేదవాడి ఫ్రిజ్‌గా పిలువ బడే మట్టికుండలకు డిమాండ్ బాగా పెరిగింది. చల్లటినీటి కోసం మట్టి కుండలను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో చాలా మంది ప్రజలు సహజసిద్ధంగా ఉండే మట్టి కుండలను వినియోగిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా మదనపల్లె పట్టణం కదిరిరోడ్డు జాతీయ రహదారి వెంట చిరు వ్యాపారులు మట్టి కడవలను విక్రయిస్తున్నారు.

రెడ్డెమ్మా.. సంతానమివ్వు తల్లీ..!

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగా చూడు తల్లీ అంటూ భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి వేకువజామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతాన ప్రదాయినిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. ఆలయ పరిసరాల్లోని దిగువ తొట్లివారిపల్లెలో అమ్మవారి అర్చకుల కుటుంబీకులు పంపిణీ చేసే ఆకు పసరు సేవించి మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించిచారు. తడిబట్టలతోనే అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు.



సంతాన ప్రాప్తి కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరసారెలతో మొక్కుబడులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. హిందువులతోపాటు ముస్లింలు కూడా అమ్మవారిని దర్శించుకోవడం గమనార్హం.

మాలల సింహగర్జనను జయప్రదం చేయండి

గుర్రంకొండ: తిరుపతిలో ఈ నెల 23న నిర్వహించే మాలల సంహగర్జనను జయప్రదం చేయాలని మాల మహనాడు జిల్లా అధ్యక్షుడు శివయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ఉసిరికాయలపల్లె, గంగిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో మాలల సింహగర్జనకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి నాయకులు తరలివస్తారని తెలిపారు. మాలలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండల కార్యదర్శి నాగరాజు, నాయకులు ఆనంద్, రెడ్డెప్ప, శంకర, సంజీవ, నరసింహులు, రామచంద్ర, వెంకటరమణ, అనసూయ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

నేడు మున్సిపల్ కార్మికుల సమస్యలపై ధర్నా

మదనపల్లె: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి వత్రి సురేష్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆప్కాస్ రద్దు చేయాల్సి వస్తే మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాల చెల్లింపు బాధ్యత స్థానిక మున్సిపాలిటీ తీసుకుని వేతనాలు చెల్లించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీసవేతనం రూ.36వేలు చెల్లించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్తు ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాయచోటి కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల నుంచి పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

మదనపల్లె: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షుడు పొదల నరసింహులు తెలిపారు. వాల్మీకుల హక్కుల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొదల నరసింహులు మాట్లాడుతూ వాల్మీకుల చిరకాల కోరిక.. ఎస్టీ జాబితా పునరుద్ధరణ కోసం అనేక ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్నప్పటికీ, రాజకీయ పార్టీలు వాల్మీకులను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకొని విస్మరిస్తున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ బిల్లును అమలు జరిగేలా చూస్తామని హామీలు ఇచ్చి అసెంబ్లీ సమావేశాల్లో వాటిని ప్రస్తావించక పోవడం శోచనీయమన్నారు. వాల్మీకుల న్యాయమైన డిమాండ్ పరిష్కారం కోసం బీసీలతో కలిసి నడిచేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా దేశ రాజధాని ఢిల్లీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, తిరుపతి, అన్నమయ్య జిల్లా నాయకులతో సంప్రదించి సమన్వయం చేసుకొని ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రారంభమైన బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో వాల్మీకుల ఆకాంక్షను నెరవేర్చే విధంగా ఎస్టీ సాధన బిల్లు కేంద్ర ప్రభుత్వం ఆమోదించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఎస్‌ఎస్ కోశాధికారి విజయ్ మోహన్, కొత్తఉడుము శంకర, వేల్పుల వెంకట రమణ, పలమనేరు మంజు, ఈడిగ పల్లి గురప్ప, రమేష్, వాల్మీకి నగర్ చిన్న రెడ్డెప్ప, శ్రీరాములు, శ్రీనివాసులు, భార్లపల్లి రామకృష్ణ, నిమ్మనపల్లి శంకర, బోడుమల్లు దిన్నె సుధాకర్, దొనబైలు పెద్దన్న, బొగ్గిటి వారి పల్లి నరసింహులు, చెన్నం శ్రీరాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షుడు పొదల నరసింహులు తదితరులు